విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 08 జూన్ 2025 8 పేజీలు

ఎమ్మెల్యే గారూ... మా కాలనీకి రండి

- నాడు స్థలం.. ఇల్లు ఇచ్చి.. నేడు పట్టించుకోవడం లేదు
- నాడు ఉచితం అన్నారు... నేడు కాసులు అడుగుతున్నారు
- పార్టీల ద్వేషం ప్రజలపై ఎందుకు?

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఇల్లు లేనివారికి స్థలం, ఇల్లు ఇచ్చి పేదల కుటుంబాల్లో ఎంతో ఆనందం కలిగించిన పరిస్థితులను మరిచి, ఎందుకు ఇంత దూరం వచ్చాం, ఒక రోడ్డు లేదు, ఒక డ్రైన్ లేదు అంటూ వాపోతున్నారు అన్నదేవరపేటలో వైఎస్సార్ నగర వాసులు. తమ సమస్యల పై ఎమ్మెల్యే దృష్టి పెట్టడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో అద్దెకుంటున్న వాళ్ళు, ఒకే ఇంట్లో నాలుగు కుటుంబాలున్న వారు సొంత గూడు లేని ఎంతో మంది తమకంటూ ఒక ఇల్లు ఏర్పాటు అవుతుందన్న ఆనందం అందరి లోనూ కనబడింది. తాళ్లపూడి మండలం లోని తాళ్లపూడి, వేగేశ్వరపురం, ప్రక్కిలంక, తాడిపూడి తదితర గ్రామాల్లో పరాయి పంచన నివాసం వుండే సుమారు 900 మందికి పైగా కుటుంబాలకు

స్థలాలు కేటాయించారు. ఇళ్లు కట్టుకునేందుకు 1లక్ష 85 వేల రూపాయలు మంజూరు చేయగా అదొక పెద్ద గ్రామం గా ఏర్పాటైంది. ప్రత్యేక పంచాయతీగా మారుతుందని భావించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాలో ఏర్పడ్డ కొత్త ప్రాంతాన్ని వైఎస్సార్ నగర్ అని స్థానిక నాయకులు నామకరణం చేశారు. గోతులిచ్చారు, కొండలిచ్చారు అని విమర్శలు వచ్చినప్పటికీ, నేడు సుమారు 150 మందికి పైగా నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. మరో 100కు పైగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

డ్రైన్ లేదు, కరెంట్ ఇవ్వరు

అన్ని వసతులతో కాలనీ ఏర్పాటు చేస్తారన్నది అప్పటి మాట కాగా, ప్రభుత్వం మారటం, ఎన్డీయే అధికారం లోకి వచ్చాక ఆ కాలనీల వైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూడటం లేదన్నది నగ్న సత్యం. ఇళ్ళు కట్టుకున్నా మౌలిక వసతులు కల్పించలేదని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. ముందుగా నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ▶మిగతా 2లో..

ఫలిస్తున్న సీపీఐ పోరాటాలు

- 158 మంది రైతులకు రూ. కోటి 32 లక్షల నష్టపరిహారం
- బోరువంచలో సీపీఐ శాఖ ఏర్పాటు

విశాలాంధ్ర - చాట్రాయి : సీడ్ మొక్కజొన్న సాగుచేసి నష్టపోయిన రైతులకు అండగా సీపీఐ చేస్తున్న పోరాటాలు ఫలితాలను ఇస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు పత్తా లేకపోయినా సీపీఐ నూజివీడు నియోజకవర్గ కేంద్రమైన అమర్ భవన్ నుంచి సాగించిన పోరాటాలు ఆరుగాలం కాయ కష్టం చేసి నష్టపోయిన రైతన్నలకు కారు చీకట్లో కాంతి రేఖలా నిలిచింది. 8 గ్రామాలలో మార్చి నెల నుంచి సాగించిన పోరాటం వల్ల 87 మంది రైతులకు ఫలితాలను ఇచ్చింది.

రకరకాల విత్తన కంపెనీలు నూజివీడు రెవిన్యూ డివిజన్ లో దృష్టి పెట్టి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయనే చెప్పాలి. ఈ ప్రాంతం విత్తనోత్పత్తికి అనువైనది కావడంతో విత్తనాల కంపెనీలు నాయకులను గ్రామ దళారులను ఆశ్రయించి నాశిరకం కంపెనీల వాళ్ళు రైతులు,కౌలు రైతులకు అధిక దిగుబడులు ఆశగా చూపించి అంగీకార పత్రాలు ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వలన రైతుల జీవితాలు దుర్భరంగా మారాయి. ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం ప్రధాన కారణంగా కనబడుతోంది. ఈప్రాంతంలోకి ఏ కంపెనీ వస్తుందో,ఏ కంపెనీ వెళుతుందో కూడా ఎవరికి తెలియని పరిస్థితి. పంట చేతికి వచ్చిన తర్వాత దిగుబడులు రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తర్వాత కంపెనీ ఆర్గనైజర్‌లు గ్రామాలలో పెత్తందారులను పట్టుకుని తులమో ఫలమో రైతుల చేతుల్లో పెట్టి చేతులు దులుపుకొని వెళ్ళి పోవడం పరిపాటిగా మారింది. సీజన్ రావడంతోనే మళ్ళీ గ్రామాలపై పడుతున్నారు. సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో నూజివీడు నియోజకవర్గంలోని బోరువంచలో 30 మంది రైతులకు 68 ఎకరాలలో రూ.22 లక్షల 70 వేల నష్టపరిహారం, కాట్రేనిపాడులో 25 మంది రైతులు 40 ఎకరాలు ▶మిగతా 2లో..

19న అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన ప్రతిష్టాత్మక అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు జూన్ 19న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిలు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో సభా వేదిక, తదితర ఏర్పాట్లను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. శనివారం స్థానిక పుష్కర్ ఘాట్, హేవాలక్ బ్రిడ్జి వద్ద అధికారులతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ పర్యటన వివరాలు తెలియ చేస్తూ, సాస్కి -2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్) స్కీమ్ ద్వారా మంజూరైన రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 2027లో జరగనున్న పవిత్ర గోదావరి పుష్కరాలలోపే అఖండ గోదావరి ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని వెల్లడించారు. తద్వారా తూర్పు గోదావరి జిల్లాలోని పరిసర ప్రాంతాలు సరికొత్త సొబగులు సంతరించుకుంటాయని పేర్కొన్నారు. చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలిపేలా సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనతో పాటు మంచి అనుభూతిని అఖండ గోదావరి ప్రాజెక్ట్ ప్రతీకగా నిలిచేలా పనులు చేపట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి వివరాలు తెలియ చేస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 127 ఏళ్ల చరిత్ర గలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జిని ఆధునికీకరిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో హేవలాక్ వంతెన ప్రాంతంలో జలపాతాలు, గ్లాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్ హాట్ క్రాఫ్ట్ ▶మిగతా 2లో..

సాక్షి టీవీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర

విశాలాంధ్ర-ఏలూరు: మహిళలను కించపరిచే విధంగా సాక్షి ఛానల్ డిబేట్‌లో మాట్లాడిన కృష్ణంరాజుపై, సాక్షి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధానిగా ఉండాలని 2014లో సమర్ధించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని నిర్లక్ష్యం చేసి, అమరావతి రాజధాని

నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించారని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణా నికి చర్యలు తీసుకుని,నిర్మాణాలను వేగవంతం చేస్తుంటే వైసీపీ నాయకులు అమరావతిపై ఉన్న అక్కసును వెళ్ళగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి రాష్ట్రంలోని ప్రజలందరికీ తలమానికంగా ఉండేలా నిర్మాణం జరగడానికి సరైన సలహాలు, సూచనలు ఇవ్వకుండా వైయస్సార్సీపీ నాయకుడు, అధినేత జగన్మోహన్ రెడ్డి భార్య భారతీ రెడ్డికి చెందిన సాక్షి టీవీలో ఎడిటర్ కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించే డిబేట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిని దేవతల రాజధానిగా పోల్చి చెబుతున్నారని వ్యంగంగా మాట్లాడుతూ, అమరావతి దేవతల రాజధాని కాదు అది వేశ్యల రాజధాని అంటూ యావత్తు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా లోకాన్ని కించపరిచేలా డిబేట్ నిర్వహించిన ఎడిటర్ కొమ్మినేని శ్రీనివాస రావు , కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిద్దరిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

9న జిల్లాల విజన్ ప్లాన్ ఆవిష్కరణ

కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 9వ తేదీన సీఎం నారా చంద్రబాబునాయుడు అన్ని జిల్లాల, నియోజకవర్గాల విజన్ ప్లాన్ ఆవిష్కరించ నున్నారని, ఇందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కోర్టు హాలులో విజన్ ప్లాన్ పై సంబంధిత అధికారులు, జిల్లా, నియోజకవర్గ స్థాయి విజన్ ప్లాన్ ఆవిష్కరణ, రైసింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రధాన ▶మిగతా 2లో..

నేటి నుంచి ఇసుక రీచ్‌లలో ప్రత్యక్ష విక్రయాలు నిలుపుదల

విశాలాంధ్ర - అమలాపురం : రుతుపవనాలు సమీపిస్తున్నందున డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 20 ఇసుక రీచ్‌లలో ఈ నెల ఎనిమిదో తేదీ నుండి బహిరంగ ఇసుక విక్రయాలు నిలుపుదల చేసి స్టాక్ యార్డుల ద్వారా విక్రయానికి చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ▶మిగతా 2లో..

శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: గోవిందా...గోవిందా..అంటూ వేలాది మంది భక్తులు ద్వారకా తిరుమల శ్రీవారిని దర్శించి తరించారు. స్వామివారికి శనివారం ప్రీతి పాత్రమైన రోజు

కావడంతో రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో కేశఖండనశాల,శ్రీవారి దర్శన క్యూ లైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలలో భక్తులు బారులు తీరారు. సామాన్య భక్తులకు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డ తల్లులను ప్రత్యేక క్యూలలో దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు,పర్యవేక్షించారు.

గన్నిని కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గన్ని వీరాంజనేయులును శనివారం నిడమర్రు మండల టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి మొహమ్మద్ గఫర్ ఖాన్, మండల టిడిపి అధ్యక్షుడు ముత్యాల స్వామి, సత్తినీడి వెంకటేశ్వరరావు(

నాని), రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మహమ్మద్ జాకీర్, బొబ్బిలి వెంకట స్వామి, బొబ్బిలి రాంబాబు, పసుపులేటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలంలో 0-6 సంవత్సరాల పిల్లలకు రెండు విడతలుగా స్పెషల్ మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. మొదటి విడతగా 10, 11వ తేదీలలో గ్రామ సచివాలయం పాలకోడేరు , గ్రామ సచివాలయం శృంగ వృక్షం -1, గ్రామ సచివాలయం కోరుకొల్లు వద్ద,12, 13 తేదీలలో గ్రామ సచివాలయం కుముదవల్లి, గ్రామ సచివాలయం పెన్నాడ అగ్రహారం -1, గ్రామ సచివాలయం మోగల్లు -1 వద్ద, రెండవ విడుతగా 24, 25 తేదీలలో గ్రామ సచివాలయం గొల్లల కోడేరు, గ్రామ సచివాలయం గోరగనమూడి, గ్రామ సచివాలయం కొండేపూడి వద్ద, 26, 27 తేదీలలో గ్రామ సచివాలయం గరగపర్రు, గ్రామ సచివాలయం విస్సాకోడేరు -1, గ్రామ సచివాలయం వేంద్ర వద్ద జరుగుతాయని ఈ సేవల గురించి సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది చిన్నపిల్లల తల్లులకు తెలియజేసి ఆధార్ మొబైల్ క్యాంపులు సద్వినియోగపరచుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు.

ఆవిష్కరణ

(1వ పేజీ తరువాయి)

ఉత్సవ కార్యక్రమం, జిల్లాలో గత జూన్‌నుంచి ఇప్పటివరకు పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలు, మంజూరు చేసిన పనుల శంకుస్థాపనలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న ముఖ్య మంత్రి జిల్లా, నియోజకవర్గాల విజన్ ప్లాన్‌ను ఆవిష్కరించ నున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ఏ నియోజకవర్గ అధికారు లతో నైనా ముఖ్యమంత్రి నేరుగా విజన్ ప్లాన్ పై మాట్లాడే అవకాశం ఉందని, అందుకు తగిన విధంగా అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. 9వ తేదీనే జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఓ జె. వెంకట్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిలుపుదల

(1వ పేజీ తరువాయి)

ఇకపై స్టాక్ యార్డుల ద్వారా ఇసుకను కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో రావులపాలెం, గోపాలపురం, జొన్నాడ, తాతపూడి, అమలాపురం, ఊబలంక 1,2, వద్దిపర్రు 1,2 రీచులు, పొడగట్లపల్లి 1,2, కపిలేశ్వరపురం, ఆలమూరు, పులిదిండి, ఆత్రేయపురం, అంకంపాలెం, నార్కెడమిల్లి, తదితర రీచులలో ఈ నెల ఎనిమిదో తేదీ నుండి బహిరంగ ప్రత్యక్ష ఇసుక విక్రయాలు నిలుపుదల చేసి స్టాక్ యార్డుల ద్వారా తరలించేందుకు జిల్లా భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలోచర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ 20 బహిరంగ రీచులకు వెళ్లే మార్గాలలో ట్రెంచులు త్రవ్వినట్లు పేర్కొన్నారు.

శంకుస్థాపన

(1వ పేజీ తరువాయి)

బజార్, హ్యాంగింగ్ గార్డెన్స్, హోలోగ్రామ్ జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, ఆక్వేరియం టన్నెల్‌లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయనున్నామని వివరించారు. భవిష్యత్తులో పర్యాటక ఆకర్షణ కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్‌తోపాటు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, జిల్లా పర్యాటక అధికారి పి. వెంకటాచలం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మునిసిపల్, టూరిజం ఇతర సమన్వయ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి సమావేశం నిర్వహించారు.

పోరాటాలు

(1వ పేజీ తరువాయి)

రూ.27 లక్షలు, దిగవల్లిలో ఒక రైతుకు రెండున్నర ఎకరాలు రూ.రెండు లక్షలు, యనమదలలో 4గురు రైతులు 20 ఎకరాలు రూ.16 లక్షలు, రేగుంట నలుగురు రైతులకు నాలుగు ఎకరాలు రూ.4 లక్షలు, మొర్సపూడి 5 మంది రైతులు 20 ఎకరాలు రూ.18 లక్షలు, గొల్లపల్లి 24 ఎకరాలు 18 మంది రైతులు రూ.35 లక్షలు, ఒట్టిగుడిపాడులో మోసపోయి మనోవేదనతో మృతి చెందిన మొక్కజొన్న రైతుకు రూ. ఏడున్నర లక్షలు, నష్టపరిహారం ఇప్పించారు. పోరాటాలు ఫలితం ఇస్తున్న నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు రాకతో బోరువంచ గ్రామంలో ఒక మాజీ సర్పంచ్ తో సహా వైసీపీ, టీడీపీలకు చెందిన రైతులు సీపీఐలో సభ్యత్వం తీసుకొని పార్టీ శాఖను ప్రారంభించారు.

రైతు చైతన్యం కావాలి
నిమ్మగడ్డ నరసింహ

రైతు ఉద్యమాలతో ప్రత్యక్ష సంబంధం కలిగిన సీపీఐ నూజివీడు నియోజకవర్గ నాయకులు నిమ్మగడ్డ నరసింహ విశాలాంధ్రతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు సీడ్ మొక్కజొన్న సాగుపై ధర నిర్ణయం అగ్రిమెంట్లు వగైరా అంశాల పట్ల రైతులను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విత్తన చట్టాలు రైతుల హక్కులు గురించి చట్టబద్ధమైన విషయాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. సిపిఐ,రైతు ఉద్యమాలకు నిరంతరం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు

కాలనీకి రండి

(1వ పేజీ తరువాయి)

ఉంటేనే నిర్మాణాలు జరిగే పనికాదు. ఈ రెండూ కాలనీలోకి వచ్చాయి. కానీ సొంతగా పొందలేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో ఇల్లు కట్టుకున్న వారందరికీ ప్రభుత్వమే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసింది. కొత్త ప్రభుత్వం వచ్చాక కొత్త మీటర్ కావాలంటే 4 నుండి 5 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. త్రాగునీరు, వీధి కుళాయిలున్నా ఇంట్లోకి నీరు కావాలంటే దూరం నుండి పైపు లైన్ వేయించుకోవాలి. దీనికి రూ. 7 వేలు నుంచి 8 వేలు ఖర్చు అవుతోంది. అక్కడ నివాసం ఉండాలంటే ఈ రెండూ అదనపు భారమైనప్పటికీ ప్రజలు భరిస్తున్నారు. ఇక వర్షాకాలం వస్తుందంటే చాలు కాలనీ వాసులు భయపడుతున్నారు. రోడ్డు, డ్రైనేజీ లేనందున వర్షం వస్తే బంధ బాడిలో నడిచి వెళ్లాలని, ఇంట్లో చేరిన మురుగు నీరు కూడా బయటకు పోని పరిస్థితి ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. నివాసాలు లేని ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేసిన పాలకులకు ఇంత పెద్ద కాలనీ లో నడిచే దారి ఏర్పాటు చేయక పోవడం శోచనీయం. అన్ని ప్రాంతాల్లో పర్యటించే స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి తమ ప్రాంతానికి ఒక్కసారి కూడా రాలేదని, తమ సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదని ఇక్కడ నివాసముంటున్న పేద ప్రజలు వాపోతున్నారు.

అప్పుడే అమ్మకాల బోర్డులు

ఒక వైపు పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాక ముందే కొంతమంది స్థలాలను లోపాయి కారిగా అమ్మేసుకోగా, నిర్మాణాలు పూర్తయిన భవనాలకు అమ్మకం అన్న బోర్డులు వెలిశాయి. మౌలిక వసతులు లేని కారణంగా ఉండలేని వారు, పట్టణానికి దూరంగా వుంటున్నామని భావించిన వారు ఇలా అమ్మకాలు పెడుతున్నారన్నది సమా చారం. ప్రభుత్వం ఉచితంగా అందించిన స్థలాలపై పూర్తి హక్కు ఇచ్చేయటం తో అమ్మకాలు పబ్లిక్‌గా సాగిస్తున్నారని తెలుస్తోంది.

ఎమ్మెల్యే గారు... మా కాలనీకి రండి

ఇల్లు కట్టుకున్న వారికి ఇంటి పన్ను కట్టించుకుంటున్నారు, కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ కాలనీ ప్రజలు ఎమ్మెల్యేను కోరుతున్నారు. ఒక్కసారి తమ కాలనీకి వస్తే తమ సమస్యలు పరిష్కార మవుతాయన్న ఆశా భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. చివరకు రేషన్ బియ్యం కోసం ప్రతి నెలా వదిలి పెట్టి వచ్చిన పూరు వెళ్లాల్సి వస్తోందని, 200 నెలనెలా ఖర్చు అవుతున్నం దున రేషన్ తమ కాలనీలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కాలనీలో లబ్దిదారుల్లో కూడా అవసరం లేని వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నందునే నిర్మా ణాలు సాగటం లేదని, విచారణ జరిపి నిజమైన అర్హులకు వీటిని కేటాయిస్తే ప్రయోజ నం ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాద స్థితిలో కోడూరు కల్వర్టు

విశాలాంధ్ర -ముదినేపల్లి : దశాబ్దాలనాటి కల్వర్టు శిథిలావస్థలో ప్రమాద భరితంగా మారింది. ముదినేపల్లి మండలం కోడూరు క్రాస్ రోడ్డు గ్రామానికి వెళ్లేందుకు ఈ కల్వర్టు వంతెన నుండి వెళ్లాల్సి ఉంది. ఈ ప్రాంతాల వ్యవసాయ సాగులో మురుగునీరు వెళ్లేందుకు ఆనాడు తవ్విన మురుగు కాలువ కాలక్రమంలో సమీప రైతుల ఆక్రమణలతో కుచించుకుపోయింది. కల్వర్టు

శిథిలం కావడం రైలింగ్‌లు కూలిపోవడంతో రాత్రి వేళల్లో దీనిపై వెళ్లేవారు, వాహనాలు గుర్తించి జాగ్రత్తగా వెళ్లకపోతే మురుగు బోదెలో పల్టీలు కొట్టే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడినుండి సుమారు 3 కి.మీ దూరంలో ఆర్ అండ్ బి రహదారిని పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి కల్వర్టును నిర్మించాలని ఈ గ్రామస్తులు , రైతులు కోరుతున్నారు.

ప్రతిభ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి మండలం వడాలి జడ్పీ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ఎన్.ఎం.ఎం.ఎస్ స్కాలర్ షిప్ లకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వి ప్రభుదాస్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్లో ఎన్.ఎం.ఎం.ఎస్ స్కాలర్ షిప్‌లకోసం నిర్వహించిన పరీక్షల్లో వడాలి జడ్పీ పాఠశాలకు చెందిన రాజా దుర్గ సేతుమాధవి, బొల్ల రాణి 8వ తరగతి విద్యార్థినిలకు ఇంటర్ వరకు ప్రతి సంవత్సరం రూ. 10 వేలు

ఉపకార వేతనం కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఇద్దరు విద్యార్థినిలను పాఠశాల హెచ్ఎం , సిబ్బంది అభినందించారు.

మల్లుల అనురాధ మృతి ఉద్యమాలకు తీరనిలోటు

విశాలాంధ్ర -భీమవరం: మల్లుల అనురాధ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.సుందర రామరాజు అన్నారు. భార్య వియోగంతో బాధపడుతున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు, న్యాయవాది మల్లుల శ్రీనివాస రావును, ఆయన కుటుంబ సభ్యులను సుందరరామరాజు తన పార్టీ నాయకులతో

కలిసి వారి నివాసంలో శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అరసం జిల్లా సమితి సభ్యురాలిగా, మహిళా సమాఖ్య నాయకురాలిగా, న్యాయవాదిగా, తన భర్త అడుగు జాడల్లో నడుస్తూ ప్రజలకు అనురాధ ఎన్నో సేవలందిం చాలని గుర్తు చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నర్సాపురం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు మల్లుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

షైనింగ్ ప్రతిభ అవార్డులకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-లింగపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతిలో మెరిట్ ఫలితాలు సాధించిన విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు లకు లింగపాలెం

నుంచి 5గురు విద్యార్థులు ఎంపికయ్యారు.ప్రభుత్వ పాఠశాలల నుంచి ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాలకు చెందిన యాకూబ్ వలీ, ధర్మాజీగూడెం శ్రీవిద్య పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బొబ్బారి శశివరుణ్, నూరుభాషహనీఫ్, ధర్మాజీగూడెం అనన్య పాఠశాలకు చెందిన డి.ఎల్.వి.సి.కౌశిక్ చౌదరి, లింగపాలెం చైతన్య పాఠశాలకు చెందిన పెద్దింటి రోహిత ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు ఈ నెల9న కలెక్టర్ ఒక్కొక్కరికి రూ. 20వేలు నగదు, మెమొంటోను బహుకరిస్తారు.

విస్తృతంగా శాఖా సమావేశాలు

ముగ్గురు శాఖా కార్యదర్శుల ఎన్నిక

విశాలాంధ్ర -ఉండి : మండల పరిధిలో సీపీఐ శాఖ సమావేశాలు విస్తృతంగా జరుగుతున్నాయి. మండల మహాసభలు, జిల్లా మహాసభలు, ఉన్నందున ముందుగా గ్రామాల్లో శాఖ సమావేశాలు పూర్తి చేసే పనిలో మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సభ్యులు బిజీ బిజీగా ఉన్నారు. ఉండి మండల పరిధిలో శనివారం కోలమూరు, చిలుకూరు, ఉండి, మూడు గ్రామాల్లో శాఖ సమావేశాలు జరిగాయి. ఈ శాఖ సమావేశాలకు ముఖ్య అతిథులుగా సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాదు, జిల్లా సమితి సభ్యులు కోన గొల్లయ్య హాజరయ్యారు. కోలమూరు శాఖా కార్యదర్శిగా సిహెచ్. కుమారి, చిలుకూరు శాఖ కార్య దర్శిగా కర్రి సూరిబాబు, ఉండి తోపుడుబండ్ల శాఖ కార్యదర్శిగా గొర్రెల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ శాఖ సమావేశంలో రక్షిత మంచినీరు, అందించాలని, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ కోతలు నిరోధించాలని తదితర తీర్మా నాలు చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించక పోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, సానుభూతి పరులు పాల్గొన్నారు.

ఘనంగా నటరాజ రామకృష్ణ వర్ధంతి

విశాలాంధ్ర -భీమవరం: నృత్య కళకే భాష్యం చెప్పిన నాట్య కళాతపస్వి నటరాజ రామకృష్ణ అని, 64 కళల్లో నాట్యం ఒక ప్రధాన అంశమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో సంస్కార భారతి ఆధ్వర్యంలో నటరాజ రామకృష్ణ 14వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ శివుడు కూడా శివతాండవం చేసేవారని పురాణాలు చెబుతున్నాయని నటరాజ రామకృష్ణ నాట్య కళకు జీవం పోసారని అన్నారు. నృత్య కళారూపాలకు మార్గ దర్శకులు నటరాజ రామకృష్ణ అన్నారు. అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి అధ్యక్షుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు, సంస్కార భారతి కార్యదర్శి చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ నాట్యం తన ఆరో ప్రాణంగా నటరాజ రామకృష్ణ జీవించే వారని ఆయన పేరిట శివతాండవం నృత్యం అంతర్జాతీయ ఖ్యాతిని సాధించిందన్నారు. కార్యక్రమంలో రఘు సాయి సత్యనారాయణ, ఎస్ కే చాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని బొరంపాలెం గ్రామానికి చెందిన వీరమల్ల సూర్యారావు శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. మరొకరికి చూపునిచ్చేందుకు సూర్యారావు నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు భార్య వీరమ్మ, కుమారులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు ఒప్పుకున్నారు. విజయవాడ ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి చెందిన సూర్యారావు నేత్రాలను సేకరించారు. మృతి చెందిన ప్రతి ఒక్కరు నేత్రాలను దానం చేయటానికి ముందుకు రావాలని ఆయన కోరారు. నేత్రదానం చేయడం ద్వారా 16 సంవత్సరాలలోపు నలుగురు అంధులకు చూపును ఇచ్చే అవకాశం ఉంటుందని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యాలయం టెక్నీషియన్స్ సుధారాణి, హరికృష్ణ తెలిపారు.



డ్రగ్స్ నిషేధంపై విస్తృత స్థాయి ప్రచారం

విశాలాంధ్ర-ఏలూరు: మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దటమే లక్ష్యమని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాల క్రికెట్ మైదానంలో రెండు రోజుల పాటు జరుగుతున్న ఇంటర్ డిపార్టెంటల్ క్రికెట్ పోటీలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. అనంతరం ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన కలెక్టర్ వెట్రిసెల్వి,జిల్లా ఎస్.పి.,కె. ప్రతాప్ శివ కిషోర్ క్రీడాకారులను ప్రోత్సహించారు. తొలుత పోటీలో పాల్గొంటున్న ఆరు జట్ల క్రీడాకారులను కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్.పి., కె. ప్రతాప్ శివ కిషోర్ పరిచయం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించడంతో పాటు మాదక ద్రవ్యాల అమ్మకం,రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్టు పేర్కొన్నారు. ఎస్.పి., కె.పి ఎస్.ఎస్.కిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు రవాణా చేసే వారిపై కఠినమైన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా,రెవెన్యూ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించగా,టాస్ గెలిచి రెవెన్యూ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రామ్ కుమార్, డిఎస్‌డిఓ బి.శ్రీనివాసరావు,సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, ఎన్జీవో నాయకులు చోడగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఏప్రిల్ నెల 28 నుండి జూన్ 6 వరకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఎంతో ఆహ్లాదాన్ని నింపింది. ముదినేపల్లి తృతీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ముగింపు సందర్భంగా విద్యార్థులకు పాటలు, పద్యాలు వివిధ రకాలైన ఆటల పోటీలు నిర్వహిం చారు. ఇందులో విజేతలకు ప్రథమ , ద్వితీయ, తృతీయ బహుమతులు, ధృవీకరణ పత్రాలు, ప్రతిరోజు హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం. శ్రీదేవి , సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేసేందుకు ఈనెల పదవ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నా మని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పల్లికొండ కిరణ్మయి శనివారం తెలిపారు. దరఖాస్తుదారులు గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని డాక్టర్ తెలిపారు. ఆశా ఆరోగ్య కార్యకర్తలకు అర్హతలు... వయస్సు 25 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలు మించకూడ దని, ఆ గ్రామంలో కోడలై ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఆమె తెలిపారు. ఖాళీగా ఉన్న సెంటర్లు...వల్లూరు సచివాలయం 1, కొత్తపల్లి సచివాలయం పరిధిలోని వరదరాజపురం 1 పోస్టు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల్లో ఉన్నవారు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

లూథరన్ చర్చి వార్షికోత్సవం

విశాలాంధ్ర - కాళ్ల : మండలంలోని పెద్ద అమిరం సెయింట్ పాల్స్ లూథరన్ నూతన మందిర 13వ వార్షికోత్సవ సభలు పాస్టర్ చింతల విక్టర్‌బాబు అధ్యక్షతన మూడు రోజులు ఘనంగా నిర్వహించారు. దైవ సేవకులు ఆమెన్ సామ్యేల్, డాక్టర్ మంగాచార్యులు, డి.ఎల్. ఫినేహాస్ వాక్య పరిచర్య చేశారు. స్త్రీ సమాజం,,యూత్ వారు పాడిన పాటలు అందరిని విశ్వాసంలో బలపర్చాయి. ఈ సందర్భంగా గతంలో దేవాలయంలో పాస్టర్స్‌గా పనిచేసిన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దిన రవీంద్ర

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: విద్యార్థులకు నిత్యం ఏదో ఒకటి నేర్పించాలని జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న తపనతో పాఠశాల విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తూ విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆటలు ఆడించిన వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్రను స్థానిక గొల్లపల్లి గ్రామంతోపాటు నియోజకవర్గంలోని పలు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు కొనియాడుతున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలోని శ్రీ అన్నే రామ కృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఆటల పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధిస్తూ ఎంతో మంది క్రీడాకారులకు స్ఫూర్తినిస్తున్నారు. గ్రామీణ బాల, బాలికలతో పతకాల పంటను పండిస్తున్నారు. 2017-2018 సంవత్సరంలో సైకిల్ పోలో ఆటలో రాంబాబు, అజయబాబు జాతీయ స్థాయి లో పాల్గొన్నారు. అదే సంవత్సరం విక్టోరియా టౌన్ హాల్ నూజివీడులో జరిగిన జిల్లా బాస్కెట్‌బాల్ సెలక్షన్ లో రుద్రపాటి రక్షిత పాల్గొన్నది. 2018-2019 సంవత్సరంలో సైలెంబమ్ ఆటలో యువరాజ్, వడ్డికాసులు, రహీం, అజయ్‌బాబు జాతీయస్థాయిలో పాల్గొన్నారు. అదే సంవత్సరం ఫెన్సింగ్ ఆటలో నాగమాధవి, వరలక్ష్మి, ఊహ, వడ్డికాసులు, అపర్ణ, అజయ్ బాబు, సమీర్ రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారు. 2019-2020 సంవత్సరంలో సైకిల్ పోలో ఆటలో గండికోట వాసవి, కందుల స్వాతి జాతీయ స్థాయిలో పాల్గొన్నారు. 2020-2021 సైకిల్ పోలో ఆటలో బచ్చు అజయ్ బాబు జాతీయ స్థాయిలో పాల్గొన్నాడు. 2021-2022 సంవత్సరంలో సైకిల్ పోలో ఆటలో గండికోట వాసవి జాతీయ స్థాయిలో పాల్గొన్నది. అదే సంవత్సరం టెన్నిస్ బాల్, క్రికెట్‌లో వాసవి, మహేంద్ర, సుమలత రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారు. 2022-2023 సంవత్సరంలో ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జయశ్రీ అనూష, వాసవి, రాజేష్ బ్రాంజ్ మెడల్ సాధించారు. అదే సంవత్సరం రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో పల్లగాని ఈశ్వరి, ప్రభు కిషోర్, రుద్రపాటి సన్నీ పాల్గొన్నారు. 2023-2024 సంవత్సరం జూడో గేమ్ స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో బచ్చు శ్రావణి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించింది. అదే సంవత్సరం ఫెన్సింగ్‌లో జయశ్రీ అనూష రజత పతకం, షేక్ గాల్విద్ కాంస్య పతకం సాధించారు. అదే సంవత్సరం జూడో గేమ్‌లో రాజేశ్వరి, మణికంఠ రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారు. అదే సంవత్సరం ఫెన్సింగ్‌లో మణికంఠ, ఉగ్ర, నిఖిల్ కుమార్ రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారు. అదే సంవత్సరం జిల్లాస్థాయి గుడివాడలో జరిగిన కబడ్డీ ఆటలో బావిశెట్టి దేవిశ్రీ,మేఘన, రాజేష్ పాల్గొన్నారు. అదే సంవత్సరం గుడివాడలో జరిగిన ఖోఖో జిల్లా సెలక్షన్‌లో భవాని ప్రసాద్ పాల్గొన్నాడు. అదే సంవత్సరం విస్సన్నపేటలో జరిగిన స్పై మార్షల్ ఆర్ట్స్ జిల్లా సెలక్షన్‌లో మునలి మేఘన పాల్గొంది. 2024-2025 సంవత్సరంలో ఆగిరిపల్లిలో జరిగిన సబ్ జోన్ 100 మీటర్ల పరుగు పందెంలో విజయ్ కుమార్ రజత పతకం సాధించాడు. ఏలూరు జిల్లాలో జరిగిన సెంట్రల్ జోన్ 100 మీటర్ల పరుగు పందెంలో విజయ్ కుమార్ రజత పతకం సాధించాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుని పి. రాధికారాణి వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రవీంద్ర పర్యవేక్షణలో, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సూచనలు, సలహాలతో పలుక్రీడా అంశాల్లో రాణిస్తూ గొల్లపల్లి పేరును రాష్ట్ర స్థాయికి తీసుకు వెళ్ళారు. కబడ్డీ, ఖోఖో,వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, బాస్కెట్ బాల్, సైకిల్ పోలో, టెన్నిస్ బాల్ క్రికెట్, అట్యా పాట్యా, స్వేయ్ మార్షల్ ఆర్ట్స్, కర్ర సాము, ఫెన్సింగ్, జూడోలో క్రీడాకారు లను తీర్చిదిద్దారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర విశాలాంధ్రతో మాట్లాడుతూ శ్రీ అన్నే రామ కృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో ఈ ఎనిమిది సంవత్సరాలు ఎంతో విజయవంతంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పాఠశాల మేనేజ్ మెంట్ కమిటీ సహాయ సహకారాలు అందించారని తెలిపారు.

రవీంద్ర

చిన్ననాటి నుండే గ్రంథ పఠనం అలవరచుకోవాలి

విశాలాంధ్ర – కొయ్యలగూడెం: చిన్ననాటి నుండే గ్రంథ పఠనం అలవరచుకోవాలని, తద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి జె.సురేష్ బాబు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థినీ విద్యార్థులకు గత 34 రోజుల నుండి నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ సురేష్‌బాబు,స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బలుసు నాగేశ్వరరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. 34 రోజులుగా వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు యు.రాముడు, సోషల్ వర్కర్ ముప్పిడి చినబాబు, ఎస్‌బిజి శేఖర్, చవ్వా సూరిబాబు, సిహెచ్‌వి రమణ, ఎండి సిరాజ్, ఎ.వి. సీతారామరాజు ,గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు

విశాలాంధ్ర – గణపవరం: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలోని నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఏలూరు పోలీస్ డిఎస్‌పి పి. శ్రావణ్ కుమార్ శనివారం గణపవరం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వారి వద్ద నుండి సుమారు 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ కిషోర్ ఆదేశాలతో నిడమర్రు సీఐ ఎంవి సుభాష్ ఆధ్వర్యంలో గణపవరం ఎస్ఐ మణికుమార్ వారి సిబ్బందితో ఈ ముఠాను అరెస్టు చేశామని అన్నారు. గణపవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డిఎస్పి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కారా అర్జున్ ఒరిస్సా రాష్ట్రం కోరాపూర్ జిల్లా నందాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిపారు. ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన దగ్గుపల్లి జోగా మారిష్, గణపవరం గ్రామానికి చెందిన సాయి కిషోర్, రాయపు రెడ్డి తరుణ్ నలుగురు వద్ద నుండి ఐదు కేజీల గంజాయి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవి సుభాష్, గణపవరం ఎస్ఐ మణి కుమార్‌లను అభినందించారు. వారికి సహకరించిన గణపవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది వై.రాజేష్, డి. శివాజీ, కాంతయ్య, డి. రత్నబాబు, పి. జగపతిబాబులను అభినందించారు.

చాగంటికి ఘన స్వాగతం

విశాలాంధ్ర – నరసాపురం: జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ,(చిన్నా) డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గంలోకి విచ్చేసిన సందర్భంగా కూటమి నాయకులు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లి ముత్యాలపల్లి వద్ద ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలసి ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ర్యాలీ ముత్యాలపల్లి నుంచి మొగల్తూరు, సీతారామపురం, రుస్తుంబాద, నరసాపురం పట్టణం, పేచుపాలెం మీదుగా ఆయన స్వగ్రామం లక్ష్మణేశ్వరం వరకు సాగింది.

లక్ష్మీపురం కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-ఏలూరు: లక్ష్మీపురం (చొదిమెళ్ళ) ప్రభుత్వ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ లక్ష్మీపురం కాలనీ ముఖ్య నాయకుల సమావేశం మావూరి విజయ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా లక్షలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని చెప్పి చాలీ చాలని సెంటు స్థలాన్ని ఏలూరుకు ఏడు కిలోమీటర్ల దూరంలో గ్రామీణ ప్రాంతంలో కాలనీ ఏర్పాటు చేశారని విమర్శించారు. ఏలూరు నగరంలో జీవనోపాధి కోసం పనిచేసుకొని తిరిగి కాలనీకి అనేక వ్యయ ప్రయాసల కోర్చి చేరుకోవాలని, సరైన రవాణా సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతంలో కాలనీ ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడ నివసించే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా చెప్పిన విధంగా సెంటు భూమి ఇచ్చిన పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలనీలో రోడ్లు,డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, మావూరి విజయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగా రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని, కాలనీ అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హేమ, నగేష్, తులసి, సింహాచలం, నరసింహ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ మత సామరస్యానికి ప్రతీక

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : మత సామరస్యానికి ప్రతీక బక్రీద్ అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తూరులోని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లా ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషా లతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. కొత్తూరులోని ఈద్గాలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్గాలో జరిగిన ప్రత్యేక నమాజ్ లో పాల్గొని అల్లాకు ప్రార్థనలు చేశారు. ఈద్గా ఖాజీ షేక్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లా సందేశం ఇచ్చారు. అలాగే నమాజ్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరూ ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమ, దయ, త్యాగం, సహనం, దానగుణం, సోదర భావం, శాంతి సామరస్యాలను బక్రీద్ పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ. 1.01లక్షల విరాళం సమకూరింది.

భీమవరానికి చెందిన ఉంగరాల గౌరీ శంకర వర ప్రసాద్ ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో శనివారం జమ చేశారు. ఈ సందర్భంగా ఈవో ఎన్‌విఎస్ఎన్ మూర్తి దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

మల్లులను పరామర్శించిన మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర -భీమవరం: సతీ వియోగంతో బాధపడుతున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు, న్యాయవాది మల్లుల శ్రీనివాసరావును, ఆయన కుటుంబ సభ్యులను పాలకోడేరు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు బాల వెంకటచలపతి వారి నివాసంలో శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మల్లుల శ్రీనివాసరావు భార్య అనురాధ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం జీర్ణించుకోలేనిదని అన్నారు. న్యాయవాదిగా తమ గ్రామాల్లోని ప్రజలకు అనురాధ ఎన్నో సేవలందించాలని ఆయన గుర్తు చేశారు. ఆయన వెంట పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

విశాలాంధ్ర–లింగపాలెం: త్యాగానికి ప్రతీక బక్రీదు పండుగని ముస్లిం మత గురువులు,పెద్దలు పేర్కొన్నారు. బక్రీదు పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా జరిపారు. మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లింగపాలెం మండలంలో ఉన్న అన్ని మసీదులలో ప్రార్థనలు జరిగాయి. ధర్మాజీ గూడెంలో ముస్లిం పెద్ద అక్బర్ బక్రీద్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. ప్రజలు శాంతి, సామరస్యంతో జీవనం సాగించాలని ఎదుటివారి పట్ల దయతో ఉండాలని బోధించారు.

గణపవరం: గణపవరం మసీదులో ఈద్-ఉల్-అజా బక్రీద్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు జరుపుకున్నారు. గణపవరం చుట్టుపక్కల గ్రామాల నుంచి ముస్లిం సోదరులు ఉదయం ఏడు గంటల సమయంలో నమాజ్ చదివారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ బదురుద్దీన్, షేక్ రహమతుల్లా, షేక్ బషీరుద్దీన్, షేక్ నాగూర్, మహమ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో టి నరసాపురం, ఏపిగుంట, బొర్రంపాలెం, తెడ్లం, మక్కినవారిగూడెం, అప్పలరాజు గూడెం గ్రామాలలో ముస్లింలు బక్రీద్ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మసీదుల్లో నమాజ్ చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం బాధ్యత భావం అలవరచుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పలరాజు గూడెం మసీదు ప్రెసిడెంట్ షేక్ బాషా, షేక్ పాషా, షేక్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: శనివారం బక్రీద్ సందర్భంగా స్థానిక మక్కా మసీదులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. ఈద్గాలో మత గురువు ముకరం హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు. త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ సందర్భంగా ప్రజలు సుఖ సంతోషాలతో, సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షులు షేక్ గౌస్, కార్యదర్శి అబ్దుల్ హక్, షేక్ బాషా, షేక్ సుభాని పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



దీపికకు స్టేట్ ఫస్టు ర్యాంకు

విశాలాంధ్ర -భీమవరం: శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మెంటేవారి తోటలోని ప్రశాంతి ఒకేషనల్ కళాశాల విద్యార్థిని బి. దీపిక ఫస్టియర్ సిఎస్ఈ విభాగంలో 500 గాను 497 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ గా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సోమిశెట్టి నాయుడు మాట్లాడుతూ తమ విద్యార్థులు కళాశాల స్థాపించింది మొదలు స్టేట్ ర్యాంకులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. దీపికను కళాశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

"శ్రీ ఆదిత్య" విద్యార్థులకు అవార్డుల పంట

విశాలాంధ్ర - కడియం : కడియం గ్రామంలోని శ్రీ ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కి చెందిన నలుగురు విద్యార్థులకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన "షైనింగ్ స్టార్" అవార్డులు లభించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ భైరిశెట్టి రామకృష్ణ తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ అవార్డు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 9 వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కడియం మండలం కడియం గ్రామానికి చెందిన శ్రీ ఆదిత్య పబ్లిక్ స్కూల్ కి చెందిన నలుగురు విద్యార్థులు పి ప్రణీత సాయి శ్రీ (591), ఎన్ లేఖన(590), ఎన్ సింధు భవాని (588), ఏ వి ఎస్ కె లాస్య శ్రీనిధి (586) లకు అత్యధిక మార్కులు సాధించినందుకు ఈ అవార్డులు లభించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ భైరిశెట్టి రామకృష్ణ తెలిపారు. అవార్డులు సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

త్యాగాల పండుగ బక్రీద్

విశాలాంధ్ర - రాజోలు : మానవాళిని జాగృత పరిచి మనలో త్యాగనిరతి చాటిచెప్పే ముస్లింల రెండవ అతి పెద్ద పవిత్రమైన పండుగ బక్రీద్ అని జామియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ అలీ(మున్నా) అన్నారు. శనివారం రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లీం మత పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అని ఖుర్బానీ సంప్రదాయం ప్రకారం మూగ జీవాన్ని బలి ఇచ్చి దానిని మూడు భాగాలు చేసి ఒక భాగం పేదలకు,రెండవ భాగం బంధువులకు, మూడవ భాగం కుటుంబ సభ్యులు తీసుకుంటారని అన్నారు. విరివిరిగా దాన, ధర్మాలు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు సభ్యులు షేక్ బాజీ, షేక్ ఇస్మాయిల్, షేక్ మీరా లాల్, షేక్ వలీ, షాబుద్దీన్, మొల్లా ఇక్బాల్, మొల్లా సర్దార్, రెహ్మాన్, రబ్బానీ, షాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేత

విశాలాంధ్ర - సామర్లకోట : ఆటో యూనియన్ల డ్రైవర్లందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, యూనిఫాం ధరించడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండటం, తమ నోటీసులో ఏవైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు ఉంటే సంబంధిత పోలీసు స్టేషన్లకు తెలియజేయాలని పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు, సీఐ కృష్ణ భగవాన్, క్రైమ్ సీఐ అంక బాబు అన్నారు. సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం శనివారం సాయంత్రం రైల్వే స్టేషన్ ఆవరణలో చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల అంతా ట్రాఫిక్ నిబంధనలో కచ్చితంగా పాటించాలి అన్నారు. ప్రయాణికుల సామాగ్రి పట్ల నిబద్ధత కలిగి ఉండి, ప్రమాదాలకు వివాదాలకు తావు లేకుండా జీవనోపాధిని సాగించాలన్నారు. అలాగే రద్దీగా ఉన్న సెంటర్లలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా పూర్తి సహకారం అందించాలన్నారు. ఇంకా పోలంసాలపై ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. అనంతరం పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, కాకినాడ, వేట్లపాలెం, ద్వారపూడి, ఉండూరు స్టాండలకు చెందిన సుమారు 100 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘు రెసిడెన్సీ అధినేత రఘు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సన్యాసిరావు, శ్రీను, ఈశ్వర రావు, సత్యనారాయణ, శ్రీను, పాండురంగ, శ్రీను, సరోజినీ, ఆయా ఆటో స్టాండ్‌ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కనీసం గోతులయినా పూడ్చండి

విశాలాంధ్ర - సీతానగరం: బాబోయ్ ఈ రోడ్డు పై ప్రయాణం చేసేది ఎలా అంటున్న ప్రజలు. మండలంలో రాపాక గ్రామ పంచాయితీ పరిధి నుండి గంగాలమ్మ మెట్ట మీదుగా నల్గొండ, కోటి కేశవరం చేరుకోవడానికి సుమారు 7కిమి రహదారి పెద్ద గోతులు పడి ద్విచక్ర, కార్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజల ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో రాపాక కోనేరు వద్ద రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా రెండు నుంచి మూడు అడుగుల లోతులో 10 అడుగుల వెడల్పుగా గోతులు పడి కార్లకు క్రింద తగులుతుంది అని వాహన దారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఈ రోడ్డును కొంత వరకూ గోతులు పూడ్చి వదిలేసింది. అయితే రాపాక గ్రామ శివారుల నుంచి నేరేడు చెట్టు వరకూ రోడ్డు పై గోతులు కాకుండా గోతులు మధ్యలో రోడ్డుగా మారింది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాబోయే వర్షకాలం కాబట్టి కనీసం ఈ గోతు లను పూడ్చక పోతే ఈ రోడ్డు పై రాకపోకలు సాధ్యం కాదని ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డుకి ఇరువైపుల పంట పొలాలు ఉండడం వల్ల రైతులు నిత్యం రాక పోకలు సాగిస్తుంటారు. ఇప్పటికే ఈ రోడ్డు వల్ల ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు అని ఇక వర్షాకాలంలో ఈ ప్రమాదాలు మరిన్ని పెరుగుతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ రోడ్డు పై అధికారులు, నాయకులు దృష్టి సారించి ప్రజల రాకలోకలకు ఇబ్బందులు కలగకుండా కనీసం గోతులు అయినా పూడ్చాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

10న ఆర్టీహెచ్‌ని వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

– జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : యువతలో, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలలో, విద్యార్థుల ద్వారా ప్రతిపాదించే నూతన ఆవిష్కరణలకు ఆర్థిక, సాంకేతిక చేయూత నివ్వడం కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీహెచ్) అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కాటంనేని భాస్కర్, పి ఎస్ ప్రద్యుమ్ను లు జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఆర్టీహెచ్ ఏర్పాటుకు సంబంధించి ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జూన్ 10వ తేదీన ఆర్టీహెచ్ వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకొన్నామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా ఆర్టీహెచ్‌కు లీడ్ పార్టనర్‌గా గ్రీన్‌కో నేతృత్వంలో వ్యవస్థీ కరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఆర్టీహెచ్ హబ్ కోసం సహ ప్రమోటర్లు, 5గురు ప్రతినిధుల అధ్యక్షులు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా హబ్ ప్రారంభానికి ప్రభుత్వ, విద్యా సంస్థలు, పరిశ్రమ సంఘాల నుండి ఇద్దరు ప్రముఖ వ్యక్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో అగ్రస్థానంలో జిబిఆర్ విద్యార్థులు

విశాలాంధ్ర - అనపర్తి : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో స్థానిక జిబిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ గ్రూపుల్లో అగ్రస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ పిఆర్ఎల్ స్వామి తెలిపారు. శనివారం విడుదలైన అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను దుప్పలపూడి రమ్య 466, డిఎస్పీ పూజిత, వి లక్ష్మీ వాణి, జి నవ్యసర 465, కే ఎస్ ఎస్ తులసి రెడ్డి, జీవిఎల్ సాయి సౌమ్య 464, పి పావని సాయి, కేవిఎల్ సత్య శ్రీ 463, పి భువనేశ్వరి, సిహెచ్ అఖిల్, డివై విజయశ్రీ 462, ఎం బాలశ్రీ, ఎం.ఎస్ హర్షిని, పి సి జి కె జయశ్రీ, టి సంతోష్ 461, షేక్ పాహిమున్నీషా, సిహెచ్ హేమ గీతిక, డి వినీల, ఎన్ సాయి మౌనిక రెడ్డి 460 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. బైపిసి విభాగంలో ఎం మానస 440 మార్కులకు ఎం మానస 432, ఎన్ ప్రియ దర్శిని 431, ఎస్ వైష్ణవి 429 మార్కులు సాధించి నట్లు ప్రిన్సిపల్ స్వామి తెలిపారు. సీఈసీ విభాగంలో ఎం ప్రజ్ఞ షరీన్ 500 మార్కులకు 482, ఎం ఎం చం దన విహారిక 466, బి సురేఖ 430, జూనియర్ ఇం టర్ హెచ్ఈసి విభాగం లో 500 మార్కులకు బిసిడి 451 సాధించినట్లు ప్రిన్సి పల్ పి ఆర్ ఎల్ స్వామి తెలిపారు. టౌన్, నియోజకవర్గ స్థాయిలో ప్రథమంగా నిలి చిన విద్యార్థులను జిబిఆర్ సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్ పి అబ్బాయి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ గొలుగూరి జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు బి రత్నారెడ్డి, డివిఆర్‌పి పాపిరెడ్డి, కె హరినాథ రెడ్డి, మల్లీ ఉమా వెంకటరెడ్డి అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - మామిడికుదురు : యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది అని యోగా గురువు ఆకుల కేతన్ అన్నారు. శనివారం మామిడికుదురు మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద సెర్ప్ ఆధ్వర్యంలో యానిమేటర్లకి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. యోగ మన శారీరక మరియు మానసిక ఆరోగ్యం మెరుగుపరచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి, మనస్సును ప్రశాంతపరచడానికి ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం డీ వరలబాబు, సీసీ ఆనంద్, అకౌంటెంట్ నాగార్జున, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బి మల్లిక, కార్యదర్శి తులసి దేవి, వివోఏలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు కలెక్టర్ ప్రశాంతి బక్రీదు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - తూర్పు గోదావరి : తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి శనివారం ముస్లిం సోదర, సోదరీ మణులకు వారి కుటుంబ సభ్యులకు ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకొని హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని, ఈ పర్వదినం శాంతి, సామరస్యా నికి ప్రతీకగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు." బక్రీద్ (ఈద్ అల్-అధా) పండుగ మానవతా విలు వలు, త్యాగం, సహనము, సామాజిక సమానత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు."బక్రీద్ పండుగ మనకు విధే యత, నమ్మకం, ఇతరుల కోసం త్యాగం చేయడ మనే జీవిత పాఠాలు నేర్పుతుంది. ఈ పండుగ నుంచి ఎంతో నేర్చుకోవాల్సింది ఉందన్నారు

రాజధాని మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పోలీసు స్టేషన్ ఆఫీసర్ సత్యనారాయణకు తాళ్లరేవు మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు టేకుమూడి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పిర్యాదు చేశారు. ఆంధ్రుల రాజధాని అమరావతి పై విషం చిమ్ముతున్న సాక్షి యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజధాని మహిళలను వ్యభిచారులుగా మాట్లాడ దం సిగ్గు చేటు అన్నారు. ఈ కార్యక్రమంలో పెమ్మాడి కృష్ణవేణి, జువ్వాది సత్యవేణి, వెంటపల్లి రామలక్ష్మి, రాష్ట్ర శెట్టి బలిజ కోర్పరేషన డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళి పూడి వెంకటరమణ (బాబి), అమలాపురం పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, ధూళిపూడి సుబ్రహ్మణ్యం, తాతాజీ, పురుషోత్తం, బేబీ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్యాగనిరతికి నిదర్శనం బక్రీద్

విశాలాంధ్ర - కడియం : ముస్లిం సోదరులు జరుపుకునే రెండవ అతి పెద్ద పర్వదినం ఈద్-ఉల్-అజా (బక్రీద్)అని, ఈ పండుగ త్యాగనిరతికి నిదర్శనం అని, ఈ సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ పేర్కొన్నారు. అల్లాహ్ ఆజ్ఞ అనుసరించి ఇస్లాంలో ముస్లిం సోదరులు పాటించే త్యాగం, అంకితభావాలకు ప్రత్యక్ష నిదర్శనంగా ఈ పండుగ నిలుస్తుందన్నారు. అల్లాహ్ ఆదేశం ప్రకారం ప్రవక్త హజరత్ ఇబ్రహీం తన పుత్రుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వటానికి సిద్ధమవుతాడు. ఇబ్రహీం త్యాగనిరతికి అల్లాహ్ పెట్టిన పరీక్షలో కన్నబిడ్డపై ప్రేమ కంటే అల్లాహ్ ఆజ్ఞకే ప్రాధాన్యత ఇచ్చిన ఇబ్రహీం త్యాగనిరతిని మెచ్చిన అల్లాహ్ చిన్నారి ఇస్మాయిల్ స్థానంలో గొర్రెను మార్చి చిన్నారిని తిరిగి తండ్రి ఒడికి చేర్చుతారు. అల్లాహ్ మార్గంలో నడిచే ముస్లింలు పాటించే త్యాగ నిరతికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచే ఈ బక్రీద్ పర్వదినం ముస్లింల జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆనంద ఉత్సాహాలు నింపాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ఆత్రేయపురం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్ని, ఆత్రేయపురం పోలీసు స్టేషన్‌కి సమాచారం రావడంతో ఆలమూరు ఎస్ఐ ఇన్చార్జ్ ఆఫ్ ఆత్రేయపురం తన స్టేషన్ సిబ్బందితో పేకాట ఆడుతున్న శిబిరంపై మెరుపు దాడి చేయగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి 3400 రూపాయలు నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యమ్ అశోక్ తెలిపారు.

అన్నపూర్ణ డే కేర్ హోం ప్రారంభం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న అనూస్ స్వచ్ఛం ద సంస్థ నూతనంగా అన్నపూర్ణ డే కేర్ హోం ఫర్ ఏజ్డ్‌ను ప్రారంభిం చింది. దీని ద్వారా వృద్ధులకు వైద్య సేవలు భోజన సదుపాయం ఆటలు పాటలు వంటి ఉచిత సేవలను అందించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్య క్షుడు లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ సీతలు తెలియజేశారు. ఈ సం దర్భంగా సుమారు 30 మంది వృద్ధులకు ఉచిత అధునాతన వైద్య పరీక్షలు నిర్వహించి, వృద్ధులకు ఆటపాటలు పోటీని నిర్వహించి విజేతలకు బహుమ తులను అందచేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బర్లంక ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, తేజశ్రీ, శ్యామ్, జాదూగర్ అన్నపూర్ణ, రుషిత్ పాల్గొన్నారు.

'శ్రీ మహతి'కి ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర - సీతానగరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రతిభ చూపిన పదవ తరగతి విద్యా ర్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రకటించారు. అయితే దీనిలో శ్రీమహతి రాజానగరం నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని కరస్పాం డెంట్ ఎ. శ్రీని వాస్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లా డుతూ రైజింగ్ స్టార్స్ అవార్డులలో గంటా లక్ష్మీ ప్రసన్న, కోమలి జస్మిత అను, సిహెచ్. శివప్రియ, యమ్. దుర్గా గణేష్, కె.బావంట్ ఎంపిక అయ్యారు అని అన్నారు. ఆర్థికంగా బాగా వెనుకబడిన కుటుంబానికి చెందినప్పటికీ పట్టుద లతో చదివి పదోతరగతి ఫలితాలలో స్టేట్ ర్యాంకు మార్కులు 590 పైన సాధించి అవార్డులతో పాటు జూని యర్ ఇంటర్‌లో అడ్వాన్స్, మెయిన్స్ లో సెలెక్ట్ అయ్యా రని అన్నారు. ఈ అవార్డులు పొందిన విద్యార్థు లను ఐఐటి అకడమిక్ డైరెక్టర్ రాంప్రసాద్ అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - భీమ వరం : భీమవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కును శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన ఆరేటి రంగా రావు అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్నారు. ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయాన్ని అందచేయ వలసిందిగా సిఫార్సు చేయగా సీఎంఆర్ఎఫ్ నిధుల నుండి రూ.49 వేలు ఆర్థిక సహాయం చెక్కు రూపంలో మంజూరు చేయగా చెక్కును పంపిణీ చేశామన్నారు. కార్య క్రమంలో భీమవరం మండల టీడీపీ అధ్యక్ష, కార్యద ర్శులు కొయ్యలగడ్డ గణ పతి, కోళ్ల సీతారాం, భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, టీడీపీ నాయకులు గంటా త్రిమూర్తులు, కొం డ్రు శ్రీనివాస్, నేదునూరి గంగాధర్ తిలక్, గొలగాని రమేష్, యలమంచిలి శ్రీనివాస్, దొంగ వెంకటేశ్వరరావు, చెల్లబోయిన జయరాజ్ పాల్గొన్నారు.

దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి

- సుమారు 7వేల మందితో పెద్ద ఎత్తున యోగ కార్యక్రమం
- జిల్లా అంతటా యోగాంధ్రపై అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : వివిధ వృత్తులలో పని చేస్తున్న ప్రతి ఒక్కరు నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించవచ్చని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక యోగా కార్యక్రమం శనివారము కాకినాడ మెయిన్ రోడ్డు టూ టౌన్ పోలీస్ నుంచి ఎల్‌బీసీ బిల్డింగ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ యోగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మానిష్ పాటిల్ దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకట్రావు, పాడా పీడీ చైత్ర వర్షిణి, కాకినాడ ఆర్డీవోఎస్ మల్లిబాబులతో పాటు సుమారు 7 వేల మంది ఉపాధ్యాయులు హాజరై యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల మే 21 నుంచి ఈ నెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నమన్నారు. జూన్ 21న విశాఖ పట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి ఇప్పటివరకు 8.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం మాట్లాడుతూ...మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంల్లో భాగస్వామ్యం చాలా సంతోషంగా ఉందని, ఈ కార్యక్రమాలను జిల్లాలో అత్యంత ప్రతిష్టంగా నిర్వహిస్తున్న జిల్లా అధికార యంత్రాంగాన్ని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అభినందనలు తెలియజేశారు.

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర మంతట పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ గుర్తు చేశారు. కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగ దే సందర్భంగా మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా గురించి గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలనేది గౌరవ ముఖ్యమంత్రి ఉద్దేశమని ఆయన తెలిపారు. రోజువారి దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని దాని నుంచి బయటపడడానికి యోగ తప్పనిసరి అన్నారు. రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 40 సంవత్సరాలుగా చేస్తున్న యోగవల్ల 80 సంవత్సరాలు అయిన కూడా ఇంకా ఎంతో ఎనర్జిటిక్‌గా పనిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆయుష్ వైద్య అధికారి అలీ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా వాడపల్లి దివ్యక్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వేంచేసియున్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరుని దివ్యక్షేత్రం శనివారం భక్త జనంతో శోభిల్లింది. ఏడు వారాల నోము ఆచరించే భక్తులతో ఆలయ పరిసరాలన్నీ జనసంద్రాన్ని తలపించాయి. మాడవీదులన్నీ గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. ముఖ్యంగా మాఘమాసంలో శని వారం కావడంతో వివాహం కుదిరినవాళ్ళు, వివాహం ఇంకా కుదరని వాళ్ళు స్వామివారి దర్శనానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా శ్రీవారు భక్తులకు దివ్య మనోహరంగా, చందన స్వరూపునిగా దర్శిమిచ్చారు. వేకువ జామున 3 గంటలకు సుప్రభాత సేవ, తొలి హారతితో ప్రారంభమైన రద్దీ.. రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు, బెంగళూరు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కొందరు విదేశాలకు చెందిన భక్తులు కూడా స్వామి దర్శన భాగ్యంకోసం విచ్చేశారు. ప్రత్యేక దర్శనం ద్వారా 57,83, 778 రూపాయలు సాయంత్రం ఆరున్నర గంటల వరకూ వచ్చినఆదాయం సమకూరింది. వివిధ జిల్లాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు. ఆలయ డిప్యూటీ కమిష నర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు వర్మ, పోలీస్ సిబ్బంది, భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

గాయత్రి విద్యార్థుల ప్రభంజనం

- కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు
- ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - రాజానగరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవలే జరిగిన ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి ప్రభంజనం సృష్టించారు. ఏపీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గత నెల12 నుంచి మే 20వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షలకు సంబంధించి శనివారం పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. దీంతో మండలం లోని కానవరం గ్రామంలోని గాయత్రి విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం కనిపించింది.ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎం. సురేంద్ర బాబు 470 కి గాను 465 , వై.ప్రియ అక్షయ463,ఎస్.లక్ష్మీ తులసి 463,వై. యమునా దేవి 461,జి.లక్ష్మి 460 మార్కులు సాధించడంతో పాటు 56 మందికి పైగా 400కు పైగా మార్కులు వచ్చాయన్నారు.బైపిసి విభాగంలో వై.దేవి అర్చన 429 మార్కులకు గాను 440 మార్కులు సాధించగా ఎన్.సత్య 425 మార్కులు కైవసం చేసుకున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా విద్యాసంస్థలు ఛైర్మన్ వివివిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విడుదల చేసిన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు మరోసారి విజయకేతనం ఎగరవేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

జిల్లా, నియోజకవర్గాల
అభివృద్ధిపై కార్యాచరణ

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో అభివృద్ధిపథంలో నిలిపేవిధంగా ఏలూరు జిల్లా, నియోజకవర్గాల వారీగా అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో శనివారం జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అభి వృద్ధిపై కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భం గా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వృద్ధి రేటు లక్ష్యంగా జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలలోను, జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామి కాభివృద్ధి, తదితర రంగాలలో సుస్థిరాభి వృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి సమర్పించాలన్నారు. జిల్లాలో విస్తృతంగా లభిస్తున్న వనరులు, ఆహార, ఉద్యానవన రంగాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అనుకూల పరిస్థితులు, తదితర అంశాలను ప్రణాళికలో పొందుపరచా లన్నారు. జిల్లా, నియోజక వర్గాల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను ముఖ్యమంత్రికి సమర్పిం చవలసి ఉన్నందున ప్రణాళికలను వెంటనే రూపొందించాలని అధికారులను ఆదేశిం చారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, జిల్లా సహకార అధికారి ఎ. శ్రీనివాస్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎస్సి కార్పొ రేషన్ ఈడీ ఎం. ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్. వి. నాగరాణి,డిఎస్ఓ శివరామ మూర్తి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాధ్ బాబు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడి రవికుమార్, ప్రభృతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక పాటిమీద గల జగన్నాథపురంలో వేంచేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవ మహోత్సవములలో భాగముగా శనివారం యాగశాల ప్రవేశం, కుంభా రాధన ద్వార తోరణపూజ, అగ్ని ప్రతిష్టా హోమం, ధ్వజారోహణ గరుడ పట మును ధ్వజ స్తంభమునకు ముక్కోటి దేవతల ఆవాహన కోసం ఎగురవేయుట జరిగినట్లు అలయ కార్యనిర్వాహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలి పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంతానం లేని దంపతులకు గరుడ ముద్దా ప్రసాదముగా అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు లింగం శివరాంప్రసాద్ (చిట్టిబాబు), భక్తులు పాల్గొన్నారు.

విజయవంతంగా యోగాంధ్ర పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తోన్న యోగాంధ్ర పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఈ పోటీల ఫైనల్స్‌ను ఐవి ప్యాలెస్ వేదికగా సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ మూడు నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించినట్లు తెలి పారు. పోటీలు వివిధ వయస్సు కేటగిరీల్లో జరిగినట్లు చెప్పారు. విజేతలు తదుపరి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల ద్వారా ప్రతిభావంతులైన యువ యోగా సాధకులను గుర్తించి, వారి నైపుణ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో అనితర సాధ్యమైన ప్రతిభను కనపర్చి నగర ఖ్యాతిని పతాక స్థాయిలో నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు కే.ప్రభు దాస్, కె.షమ్మీ, రమ్యకీర్తన, వీఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

యోగాభ్యాసంతో మానసిక వికాసం

-నేడు హరిత బెరం పార్కులో ప్రత్యేక యోగాసనాల కార్యక్రమం

విశాలాంధ్ర - విజయవాడ : భారతీయ వారసత్వ సంపద అయిన యోగాభ్యాసంతో మానసిక వికాసం సొంతమవుతుందని.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని యోగాసనాల సాధనను నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్ర సాకారం దిశగా వడివడిగా అడుగులేస్తూ ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటోందన్నారు. 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్ సరళ యోగాను రోజూ ఆచరిస్తూ జీవితాంతం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండొచ్చని ప్రతి వర్గాన్ని యోగాంధ్రలో భాగంచేసే లక్ష్యంతోనే థీమ్ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని ఇందులో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాలో ఇప్పటికే గాంధీ హిల్, పవిత్ర సంగమం పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించామని, ఈ నెల 8వ తేదీ ఆదివారం కృష్ణానదీ తీరంలోని బెరం పార్కులో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. యోగా ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో 18వ రోజు కార్యక్రమం:

జిల్లాలో కనీసం పది లక్షల మందికి యోగాసనాలను నేర్పే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక యోగా ట్రైనర్లతో పెద్దఎత్తున యోగాసనాల శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విజయవాడలోని బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయుష్, జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం 18వ రోజు యోగాసనాల కార్యక్రమం విజయవంతంగా జరిగింది. యోగా ఔత్సాహికులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, డా. ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డా. జె.సుమన్, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్, ఆయుష్ అధికారి డా. రామతులసి, యోగా ట్రైనర్లు సత్యనారాయణ, రామాంజనేయులు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలనీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలు లో శనివారం జిల్లాలో యోగాంధ్ర కార్య క్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీ క్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ శారీరక,మానసిక ఆరోగ్య ప్రయోజనాలు అందించే యోగ మరింత మంది ప్రజలు సద్వినియోగం చేసుకునేలా పెద్దఎత్తున ప్రజలు యోగాం ధ్ర కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. ఈనెల 9వ తేదీ ఉదయం గం.7లకు ఏలూరులో సి ఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుండి ఇన్డోర్ స్టేడియం వరకు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు.ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో యోగాంధ్ర కార్యక్ర మాలలో భాగంగా ఈనెల 10వ తేదీన జంగారెడ్డిగూడెంలో మద్ది ఆంజనే యస్వామి గుడి వద్ద, 18వ తేదీన జీలకర్రగూడెంలోని గుంటుపల్లి గుహల వద్ద యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈనెల 13 వతేదీన ఏలూరు లోని సర్ సి.ఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్ లో జిల్లా స్థాయిలో యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు హాజరవుతారని, ఈ కార్యక్రమాలలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వా ములయ్యేలా అధి కారులు చర్యలు తీసుకోవాలని, కార్యక్రమాల నిర్వహణకు పక డ్బందీ ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భాను ప్రతాప్, ఇరిగేషన్ ఎస్ఈ నాగా ర్జునరావు, జిల్లా సహకార అధికారి ఏ. శ్రీనివాస్,డీఈఓ వెంకట లక్ష్మమ్మ, ఎస్సి కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, డిఎస్ఓ శివరామ మూర్తి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాథ్ బాబు,మైక్రో ఇరి గేషన్ ప్రాజెక్ట్ పీడీ రవికుమార్, డిఎస్‌డిఓ శ్రీనివాసరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

జూనియర్ ఇంటర్ ఫలితాలలో తిరుమల విద్యాసంస్థల ప్రభంజనం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ సంవత్సరం ఇంటర్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. ఎమ్.పి.సి. విభాగంలో 470మార్కులకు 467 మార్కులు 24 మంది విద్యార్థులు సిహెచ్. సందీప్, బత్తుల తన్మయి రిత్విక, ఆర్. పూర్ణిమ సంతోషి, పి.హేమంత్, ఎస్.వీర్షిత అక్షయ, వి.మణికంఠ, ఉప్పుగుండ్ల వెరోనిక, మోక జెన్ని బాబు, ముత్యాల హర్షిత,సింగులూరి తేజ, ముదునూరిషా ఖాన్, పర్వూరి పునీత వెంకటసాయి, కిల్లంపల్లి రేవతి దేవి,జె. గోపిక ధమని, పద్ది జ్వలిత సాయి శివవాణి, మద్దు సూర్యదేవ్, కె.సత్యప్రియ,గెద్దం రాజ నవీన్ తేజ, దాడి దినేశ్వర్, ఎ.వీర వెంకట సాయి లిఖిత, కేశన తపశ్వి, డి.దీపిక, కొవ్వూరి హాసిని, దీప్తిమహంతి సాత్విక్ సాధించారని, 466 మార్కులు పైన 155మంది, 465 మార్కులు పైన 506 మంది,463 మార్కులు పైన 1224 మంది, 460 పైన 1775 మంది, 450 పైన 2604 మంది సాధించారని ఆయన తెలియజేశారు. బై.పి.సి. విభాగంలో 440కి 437 మార్కులు మొహ మ్మద్ మనీష, గంగేయులు కృష్ణ చందన, కాద గాయత్రి, గంపల వీర వెంకట లక్ష్మణ్ సాధించారని, 435 పైన 90 మంది, 430 పైన 292 మంది, 400 పైగా మార్కులు 501 మంది సాధించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా అత్య ధిక మార్కులు వచ్చిన విద్యార్థులను తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యాసంస్థల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.P. No. 10/2025

Between:

Bommula Srinivasu S/o Subbarao, R/o. D.No.1-68, Hindu aged 38 years, Krishna Nagar, Rajamahendravaram. Present Address: D.No. 1-68, Palacherla Road, Gadala, Korukonda Mandal, E.G.Dist., ...*Petitioner*

AND

1. Vemuluri Peda Veeranna (Kapu), S/o Suryanarayana, Hindu aged 65 years, Gadala Village, Korukonda Mandal.
2. Bhajana Krishnarjuna, S/o Satyanarayana, Hindu, aged 45 years, 4th street, Gadala Village.
3. Narni Srinu, S/o Sesharao, Hindu, aged 30 years, finance, 4th street, Gadala Village.
4. Kothapalli Srinivas, Hindu, aged 45 years, Opp: Cheruvu, Nidigatla Village.
5. Satyam Paparao, S/o Suribabu, Hindu, aged 36 years, Business, Dwarapudi puntha, Gadala.
6. Muppidisetti Manga, W/o Nageswara Rao, Hindu, aged 48 years, house wife, Palacherla Road, Gadala
7. Mallimoggala Chinnibabu S/o Suribabu, finance, Hindu, aged 38 years; Dwarapudi Puntha Road, Gadala
8. Uppaganti Eswar Prasad, Lalitha Nagar 5th street, Business, Hindu, aged 47 years, Opp; Durga Temple, Rajahmundry.
9. Lanka Jayaram, S/o not known Hindu aged 33 years, V. L. Puram, Rajahmundry.
10. Vennu Durga Bhavani, W/o not known, Hindu aged 48 years, Annapurnammapeta, Rajahmundry.
11. Balla Ramakrishna, S/o not known, Hindu aged 42 years, Lalacheruvu, Rajahmundry.
12. Adireddy Srinivas, Morampudi, Hindu, aged 50 years, Rajahmundry.

...*Respondents*

పై గ్రంథములో పిటీషనరు/ డెటరు తనకు గల అప్పులు చెల్లించు శక్తి లేదని ఇన్సాల్వెంటుగా/ దివాళాదారుగా డిక్లేరు చేయమని కోరుచూ పై పిటీషను దాఖలు చేసియున్నారు. కావున పైన తెలిపిన రెస్పాండెంట్లకు గాని, ఎవరికైనా పై గ్రంథములో ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల **దీ. 03-7-2025వ తేదీన** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై వారికి గల అభ్యంతరములు పై కోర్టు వారి ఎదుట మనవి చేసుకోవలెను. కావున ఎల్లరుకు తెలియపర్చడమైనది.

కె.బాలభాస్కర్

రాజమండ్రి 07-6-25 అడ్వకేటు, రాజమండ్రి సెల్: 9848346752

అక్రమ బొండు ఇసుక వ్యాపారం జరిగితే అధికారులకు పట్టదా ...

- మామూళ్ల మత్తులో యంత్రాంగం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : తీర ప్రాంతాన్ని గుల్ల చేసి అక్రమ ఇసుక దందా సాగిస్తున్న అధి కారులు, పోలీసులు ఏమాత్రం పట్టించుకోవటం లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ ఎన్ వర్మ అన్నారు. కొత్తపల్లి మండలం రావివారిపోడు, మల్లివారితోట పరిసర ప్రాంతాల్లో అక్రమ బొండు ఇసుక తవ్వ కాలు సాగిస్తున్నారని దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవయ్య పరిస్థితి ఏర్పడుతుందని స్థానిక ప్రజలు ఆయనకి సమాచారం ఇవ్వడంతో ఆయన శని వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మల్లివారి తోట, రమ ణక్కపేట ఏరియాలో రాత్రులు రోజుకి 200 నుంచి 300 లారీలు బొండు ఇసుక మాఫియా లారీకి రూ.8000 చొప్పున అమ్ముతున్నాడు. గత ఐదు సంవత్సరాలు వైఎస్ఆర్సిపి పార్టీలో బొండు ఇసుక చెరువులు మొత్తం కోట్ల రూపాయలు మింగేసారు. అదే టీము వైసీపీ టీం ఇప్పుడు కొత్త ముసుగు వేసు కొని మరలా ఇసుక మాఫియా విపరీతంగా కొత్త పల్లి మండలంలో రోజుకి 300 లారీలు అమ్మ కాలు జరుగుతున్నాయి ఇది కూటమి ప్రభుత్వానికి చాలా చెడ్డ పేరు తెస్తా ఉంది, పవన్ కళ్యాణ్ ఎక్కడ కూడా ఇటువంటి అక్రమ కార్యక్రమాలు కానీ ఎటు వంటి జరక్కుండా చూడాలని పోలీసులకి మీ పని తీరు కూడా మార్చుకోండి అని కూడా చెప్పడం జరి గింది. అయినా పోలీసులు పనితీరు మారలేదు. ఈ అక్రమ తవ్వకాలు మాకు కానీ, తెలుగుదేశం పార్టీ కానీ, ఏ విధమైన సంబంధం లేదు. అంటే ఈ త్రవ్వి వాళ్ళందరూ కూడా మా పేర్లు కూడా ప్రచారం చేస్తున్నారు, ఏది ఏమైనా వైసీపీ వాళ్లు కొత్త ముసుగు వేసుకొని కూటమి ప్రభుత్వాన్ని బదనామ చేయడానికి వాళ్ళు అజెండా అని, వైసీపీ వాళ్లు కొత్త ముసుగు వేసుకొని ఇసుక మాఫియా ద్వారా అమలుపరుస్తామన్నారు. ఇటువంటి అక్రమ ఇసుక మాఫియా మీద తక్షణ చర్యలు తీసుకోవాలి, ఇది తక్షణం ఆపివేయాలని అధికారులు దృష్టిలో పెడ తాం. ఇదే ఇసుకనే మామూలు ఇసుకలో కలిపేసి రెండు మిక్స్ చేస్తా ఉన్నారు. దానివల్ల బిల్డింగులు కూడా పడిపోయే పరిస్థితి. ఇదే ఒక రైతు ఒక ట్రాక్టర్ అడిగాడంటే దానికి ఎన్నో కథలు పడతా ఉన్నారు పోలీసు వాళ్ళు, ఎన్నో ఇబ్బందులు పెడతా ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ సత్యానంద రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాజ బాబు, ఎక్స్ జెడ్పిటిసి ప్రసాదు, మూలపేట రమణ, సూరిబాబు, బుజ్జి, కోనపాప పేట శీను ఉన్నారు.

సెంటు పట్టాలను రెండు సెంట్లుకు మార్పులు చేయండి

సీపీఐ కార్యదర్శిసాకా రామకృష్ణ డిమాండు

విశాలాంధ్ర - పిఠాపురం : కాకినాడ జిల్లా పిఠాపురం గత వైసిపి ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలు ఒక సెంటు చెప్పున పట్టాలు ఇచ్చి లబ్ది దారుకు అందించడంలో విఫలమైయ్యారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన రెండు సెంట్లు హామీని వెంటనే అమలు చేయాలని, ఒక సెంటు పట్టాని రెండు సెంట్లుగా మార్పులు చేయాలని సీపీఐ నాయకులు సాకా రామ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టాలు ఇచ్చిన బాధితులు వద్దకువెళ్ళి ఆయన ఈ విధంగా స్పందించారు. వందలాది ఎకరాలను నిరూపయంగా వదిలేసి ప్రభుత్వ అధికారులు మౌనంగా ఉన్నారని పేదవాడు గోడు ప్రభుత్వాలకు వినబడడం లేదని, కానీ సిపిఐ పార్టీ బాధ్యత తీసుకుని సేకరించి స్థలాలు తక్షణమే నిరుపేదలకు ఇవ్వాలని పోరా బాట పట్టిందన్నారు. ఈ స్థలాలన్నీ పేదలకు ఇచ్చేవరకు సిపిఐ పార్టీ పోరాటం ఆగదని ఘటూగా హెచ్చరించారు. టౌన్‌లో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు హామీలు తప్పకుండా అమలుచేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా గృహాలు నిర్మాణాలకి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పేపకాయల ప్రసాద్, సిహెచ్ రెడ్డి, ఉమా సి కోల్ సత్యవతి, సిహెచ్ జ్యోతి, శ్రీలక్ష్మి, కేసరి అరుణ పాల్గొన్నారు.

ఎన్ఎమ్ఎమ్ఎస్‌లో అరట్లకట్ట విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర - కరప : కేంద్ర ప్రభుత్వంచే నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ 2024-25 ప్రవేశపరీక్షలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అరట్లకట్ట నుండి 5గురు విద్యార్థులు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు,్రా శ్రీనివాస్ కుమార్ తెలియజేసారు. వీరికి సంవత్సరమునకు 12,000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ ఇవ్వడం జరుగుతుంది. 5 సంవత్సరాలు పాటు వస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నక్కా నాగసత్య మల్లీశ్వరి, పంతుల సాయిలక్ష్మి, సర్విసెట్టి వీరలక్ష్మి సాయి సుజన, మేడిశెట్టి మాలాశ్రీ, సిద్దాంతపు గీతా మాధురిలకు మండల విద్యాశాఖధికారులు ఖ బులి కృష్ణవేణి,్రా సత్యనారాయణ మరియు ఎస్ఎంసి చైర్మన్, గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేసారు. ఇంతటి ఘన విజయాని సాధించటానికి కృషి చేసిన పాఠశాల మ్యాథ్స్ టీచర్ మాదిరెడ్డి శ్రీనివాస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలు అభినందించారు.

కొవ్వూరు వైకాపాలో కుదుపు..

- చైర్మన్‌తో సహా మరో ముగ్గురు కౌన్సిలర్లు రాజీనామా

విశాలాంధ్ర - కొవ్వూరు : నియోజకవర్గ కేంద్రమైన కొవ్వూరులో వైకాపాకు జలక్ ఇచ్చారు. కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి మూడవ వార్డు కౌన్సిలర్ వరుగేటి లలిత కుమారి, పదవ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, 15 వార్డు కౌన్సి లర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీందర్లు వైకాపాకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలవల్ల మరియు పట్టణాభివృద్ధి కోసం అదే విధంగా ఎన్డీఏ కూటమి విధానాలకు మెచ్చి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కాగా తెదేపా సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చి బాబును కొవ్వూరు పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రేపు చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి జాయిన్ కానున్నట్లు సమాచారం.

డ్రోన్స్ సాంకేతికతతో మేలైన వ్యవసాయం

- ఇప్పటికే 50 శాతం సబ్సిడీతో 12 యూనిట్స్ గ్రౌండింగ్ - మరో 12 ప్రజా ప్రతినిధులు సమక్షంలో గ్రౌండింగ్‌కి సిద్ధం - కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : వ్యవసాయ శాఖ వ్యవసాయ యాంత్రీకరణ రైతు కృషీ విజ్ఞాన యోజన 2024-25 కిసాన్ డ్రోన్లను 80% "సబ్సిడీపై కిసాన్ డ్రోన్లతో గ్రామ స్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకుల స్థాపన" కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. వ్యవసాయ యాంత్రీకరణ ఆర్.కే.వి.వై. 2024-25 పథకంలో 42 కిసాన్ డ్రోన్లను మంజూరు చేయగా నిబంధనలు మేరకు 38 డ్రోన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ ద్వారా ఎంప్యానెల్ చేయబడిన రెండు డ్రోన్ మోడళ్లకు సంబంధించిన వివరాలు డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 9,80,000, విహంగ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమి టెడ్ - రూ.9,81,000 అమోదం ఇచ్చిందన్నారు. డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు 5 గురు సభ్యులు కలిగిన రైతు సీహెచ్‌సిలో సభ్యుల ఆమోదంతో ఒకరికి డ్రోన్ టెక్నాలజీ పైలెట్‌గా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 50 సం. మధ్య ఉండి కనీస ఇంటర్మీడియట్ అర్హత కలిగి ఉండాలన్నారు. సిహెచ్సి సభ్యులు కిసాన్ డ్రోన్ గ్రూప్ పేరు మీద బ్యాంకు ఖాతా తెరవాలనీ, యూనిట్ ఖర్చులో 50% బ్యాంకు రుణంతో యూనిట్ గ్రౌండ్ చేయడం తప్పనిసరి అన్నారు. గ్రూపులోని ఇద్దరు సభ్యులు కన్వీనర్, కో-కన్వీనర్‌గా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు, ఆర్డర్, డ్రోన్ యూనిట్ మంజూరు, బ్యాంక్ రుణం తదుపరి ధృవపత్రాలతో డ్రోన్ తయారీదారుకు కొనుగోలు కోసం ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా రైతులకి మేలు చేసేందుకే 80 శాతం రాయితీతో ఈ డ్రోన్స్‌ను అందించడం జరుగుతున్నది. వీటిని రైతులు అందిపుచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. డ్రోన్ ఖర్చులో 50% లబ్ధిదారుడు గ్రూపు వాటా చెల్లించాల్సి ఉంటుందని తెలియ చేశారు. డ్రోన్ ఖర్చులో మిగిలిన 50% బ్యాంకు రుణ మొత్తం నుండి నేరుగా డ్రోన్ తయారీదారుకు చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే 12 డ్రోన్స్ ఏర్పాటు చేశామని, మరో 12 డ్రోన్స్ స్థానిక ప్రజాప్రతినిధులు సమక్షంలో పంపిణి కి సిద్ధం చేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. వాటిలో చాగల్లు మండలం-1, గోపాలపురం మండలం-1, నల్లజర్ల మండలం-3, రంగంపేట మండలం-1, ఉండ్రాజవరం మండలం-1, తాళ్లపూడి మండలం-1, గోకవరం మండలం-2, సీతా నగరం మండలం-1, దేవరపల్లి మండలం-1 ఉన్నాయి.

యోగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శనివారం కాకినాడ పట్టణం సూర్య కళా మందిరంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వీ జితేంద్ర, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏయు రీజియన్ ఏడీ టీ జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ షణ్మో హన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా తరగతులను ప్రారంభించారు. యోగా శిక్షకులు జేఎన్టీ యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా సీహెచ్ సుధా దేవి, జీ కృష్ణమోహన్..ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, పాలి టెక్నిక్ కళాశాలల అధ్యాపకులు ఇతర సిబ్బంది చేత వివిధ యోగాసనాలను సాధన చేయించారు. యోగా సనాలు సాధన అనంతరం నిత్యజీవితంలో యోగా యొక్క ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థి లక్ష్ పరిక్ పతాంజలి ఏకపత్రాభినయం, మహిళల బృందం ప్రదర్శించిన స్కిట్ ఇతర సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఇంటర్మీడియట్ విద్య, రెవెన్యూ, ఆయుష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో యోగా శిక్షణ

విశాలాంధ్ర - కాకినాడ : యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని భారతరత్న బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఇంటర్మీడియట్ విద్య, రెవెన్యూ, ఆయుష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ పరిధిలోని కళాశాలల అధ్యాప కులు, పాఠశాలల ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెం ట్లు, రెవెన్యూ సిబ్బంది సుమారు 300 మందికి యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా తరగతులను ప్రారంభించారు. అలాగే పతం జలి మహర్షి చిత్రపటానికి పూలమాలలు అలం కరించి వందనాలు సమర్పించారు. హాజరైన శిక్షణా ర్థులకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేసి, యోగాభ్యాసాన్ని నిత్యం కొనసాగించడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందాలని కోరారు. అనం తరం యోగాచార్య చిట్టిబాబు ఆహుతులకు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ ప్రక్రియల శిక్షణ నిర్వహించి, వాటి సాధన వల్ల కలిగే ఆరోగ్యం ప్రయో జనాలను వివరించారు. అలాగే బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు ధ్యానం, రాజయోగం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య ఆర్జేడి శారద, కాకినాడ రూరల్ తహశీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, ఆయుష్ వైద్యులు డా విజయలక్ష్మి, లక్ష్మణ కుమార్, డిటి చైయన్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఏలూరు వైభవ్ ఆదర్శ్ లయన్స్ క్లబ్, సాయి రాకేష్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9 వ తేదీ సోమవారం ఉదయం గం.10నుంచి మధ్యాహ్నం గం. 2వరకు సాయి రాకేష్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో ఆశ్రం హాస్పిటల్ ఏలూరు వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సాయి రాకేష్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ నరసింహరాజు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నరసింహరాజు పేర్కొన్నారు.

అనివార్యకారణాల వల్ల రేపు పీజీఆర్ఎస్ రద్దు

కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఈ నెల 9న సోమవారం కాకినాడలో జరగవలసిన కార్యమం అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో ఈ నెల 9న కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో జరగవలసిన కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దు చేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.